సాక్షి
బాపట్ల

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4808 క్యూసెక్కులు విడుదల చేశారు.



స్మృతివనం పనులు పరిశీలన

విజయవాడ : అంబేడ్కర్ స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

మేలు మలుపల్లె

- సమగ్రాభివృద్ధి దిశగా పల్లెలు
- ప్రతిపక్ష సర్పంచ్ ఉన్నా కోట్ల రూపాయల ఖర్చు
- సంక్షేమ కార్యక్రమాలకు రూ.11 కోట్లు
- అభివృద్ధి పనులకు రూ.కోటి 74 లక్షలు
- తెనాలి మండలం గుడివాడ గ్రామ అభివృద్ధి తీరిది

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ పాలన గ్రామ స్వరాజ్యానికి మేలు మలుపుగా మారుతోంది. కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం, పార్టీ చూడం అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పల్లెలు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయి. స్థానికంగా ప్రతిపక్ష మద్దతుదారులు అధికారంలో ఉన్నా.. సర్కారు ప్రగతి మంత్రంతో ముందుకు సాగుతోంది. గ్రామాల ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తోంది.

2019కి ముందు.. తర్వాత

గ్రామాల అభివృద్ధి 2019కి ముందు, ఆ తర్వాత అన్న విధంగా మారింది. అన్ని గ్రామాల రూపురేఖలు మారుతూ వస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ సచివాలయంతోపాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధితో పాటు శ్మశాన వాటికల ఆధునికీకరణ, కొత్త సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



గుడివాడ గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



గుడివాడ గ్రామ సచివాలయం

గుడివాడ.. అభివృద్ధి జాడ

తెనాలి నియోజకవర్గం గుడివాడ గ్రామంలో పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం సర్పంచ్ ఎన్నిక అయ్యారు. గ్రామ జనాభా 2,900. ఓటర్లు 2,200 మందికిపైగా ఉన్నారు. వరి, పసుపు, అరటి, కూరగాయలు ప్రధానంగా పండిస్తారు. 1,164 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ప్రస్తుతం 510 మందికి వివిధ రకాల పింఛన్లు వస్తున్నాయి. 1,031 రైస్ కార్డులు ఉన్నాయి. ఈ గ్రామం 2019 తర్వాత ప్రగతిబాట పట్టింది. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు నిర్మితమయ్యాయి. మౌలిక వసతులు సమకూరాయి. ఈ గ్రామంలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.11.09 కోట్లు అందాయి.

సొంత ఇంటి కల నెరవేరింది.



పూరి ఇంట్లో ఉండే వాళ్లం. ఇళ్ల స్థలం లేదు. జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. రూ.1.80 లక్షలు రుణం మంజూరు చేశారు. కొద్దిగా అప్పు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. సొంతింటి కల సాకారమైంది. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా మా కోడలికి రూ.లక్ష వచ్చాయి. వైఎస్సార్ చేయూత వచ్చింది. డ్వాక్రా రుణమాఫీ అయ్యింది. చాలా ఆనందంగా ఉంది.

– మత్తే మార్తమ్మ, జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణదారు, గుడివాడ, తెనాలి మండలం

నిర్మాణంలో ఉన్నవి	కేటాయించిన నిధులు (రూ.ల్లో)
ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం	10,00,000
ఎస్సీ కాలనీ సీసీ డ్రెయిన్ నిర్మాణం	6,00,000
మొత్తం	16,00,000

నాలుగేళ్లలో గుడివాడ ప్రగతిపథం ఇలా..

పూర్తయిన అభివృద్ధి పని	ఖర్చుచేసిన నిధులు(రూ.ల్లో)
గ్రామ సచివాలయం	40,00,000
రైతు భరోసా కేంద్రం	21,00,000
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్	21,80,000
ఎంపీయూపీ స్కూల్‌లో నాడు-నేడు	19,50,000
అంతర్గత రోడ్లు	5,00,000
అంతర్గత డ్రెయిన్లు	15,00,000
జీజీఎంపీ డ్రెయిన్లు	7,04,000
జీజీఎంపీ రోడ్లు	1,40,000
జగనన్న లేఅవుట్లో రోడ్లు	5,50,000
హిందూ శ్మశాన వాటిక	17,00,000
హిందూశ్మశాన వాటికలో రోడ్లు	3,00,000
తిరుపతమ్మ ఆలయంలో పొంగలిషెడ్లు	8,50,000
యాదవపాలెంలో కమ్యూనిటీ హాలు	10,00,000
మొత్తం	1,74,74,000

జగనన్న మళ్లీ రావాలి



డ్వాక్రాలో స్త్రీనిధి రుణం ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఆ నగదుతో గ్రామంలో ఫ్యాన్సీ షాపును పెట్టా. బతుకుబండి హాయిగా సాగుతోంది. బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తే షాపును వృద్ధి చేసుకుంటా. జగనన్న మళ్లీ రావాలి. నాకు డ్వాక్రా రుణం మాఫీ అయింది. వైఎస్సార్ చేయూత వస్తోంది. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకోబోతున్నాం.

– బురద గుంట సుకన్య, ఎస్ఎస్ ఫ్యాషన్ నిర్వాహకురాలు, డ్వాక్రా స్త్రీనిధి లబ్ధిదారు, గుడివాడ, తెనాలి మండలం



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

రూ.కోటీ 74 లక్షలతో అభివృద్ధి



గుడివాడ ఎంపీటీసీ సభ్యునిగా గెలుపొందాను. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆశీస్సులతో గతంలో తెనాలి మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేశా. గుడివాడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేశాం. రూ.కోటీ 74 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తిచేశాం. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించడం గర్వంగా ఉంది.

– చెన్నుబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ, తెనాలి

సీఎంకు రుణపడి ఉంటాం



15 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. నయం కాలేదు. పింఛన్ కోసం గత తెలుగుదేశం ప్రభుత్వంలో దరఖాస్తు చేశా. రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ మంజూరు చేశారు. రూ.ఐదువేలు వస్తున్నాయి. మందులకు సరిపోతున్నాయి. మంచంలోనే ఉంటున్నా. సీఎం జగన్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. నా భర్తకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది.

– బొద్దులూరి అంబోజమ్మ, పక్షవాత పింఛన్‌దారు, గుడివాడ, తెనాలి మండలం.

బతకాలని ఆశ కలిగించారు



1978లో మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడ్డా. రెండు కాళ్లూ విరిగాయి. ఆపరేషన్ చేశారు. కర్రలతో నడుస్తున్నా. పెళ్లి చేసుకోలేదు. నాకంటూ ఎవరూ లేరు. జీవనానికి ఇబ్బందిగా ఉండడంతో చనిపోదామనుకున్న సమయంలో సీఎం జగన్ నాకు వ్యాధిగ్రస్తుల పింఛన్ ద్వారా రూ.ఐదువేలు మంజూరు చేశారు. బతుకుపై ఆశ కల్పించారు. జీవనం హాయిగా సాగుతోంది.

– బి.సుబ్బారావు, వ్యాధిగ్రస్తుల పింఛన్‌దారు, గుడివాడ, తెనాలి మండలం

న్యూస్‌రీల్

నవంబర్ 4న జిల్లా సైన్స్ నాటిక పోటీలు

డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి సైన్స్ నాటిక పోటీలను నవంబర్ 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం తెలిపారు. మానవ సంక్షేమం కోసం శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగాల ప్రాముఖ్యంపై నాటికలు ఉండాలని తెలిపారు. దీంతోపాటు చిరుధాన్యాలు-మంచి ఆహారం, ఆహార భద్రత, శాస్త్ర సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలు, మూఢనమ్మకాలను పారదోలుట తదితర ఉప అంశాలతో నాటికలు ఉండాలని వివరించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు గరిష్ఠంగా 8 మంది నాటిక ప్రదర్శనలో పాల్గొనవచ్చని వెల్లడించారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన బృందాన్ని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పల్నాడు జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను నవంబర్ 10వ తేదీన మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని డీఈఓ వెల్లడించారు. వివరాలకు జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ ఎ.ఎ.మధుకుమార్ 90328 71234 సంప్రదించాలని సూచించారు.

తాత్కాలికంగా పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రోణాచలం-గుంటూరు(17227), కాచిగూడ-గుంటూరు(17252) 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. గుంటూరు-డ్రోణాచలం(17228), కాచిగూడ-నడికుడి(07791), నడికుడి-కాచిగూడ(07792), విజయవాడ-గుంటూరు (07464), గుంటూరు-విజయవాడ(07465), గుంటూరు- కాచిగూడ(17251), మెదక్-కాచిగూడ(07578), కాచిగూడ-మెదక్(07577), విజయవాడ-గుంటూరు(07783), గుంటూరు-మాచర్ల(07779), మాచర్ల-నడికుడి (07580), నడికుడి-మాచర్ల(07579), మాచర్ల-గుంటూరు(07780), గుంటూరు-విజయవాడ(07788) రైళ్లను నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు

పెదకాకాని: ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితా సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు బీఎల్‌ఓలకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గత ఆగస్టులో మండలంలో ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ జాబితాపై సర్వే నిర్వహించారు. తొలగించిన ఓట్లు, ద్వంద్వ ఓట్లు, డెత్ కేసులు, కొత్త ఓటర్ల నమోదుపై సర్వే జరిగింది. ముఖ్యంగా గత కాలానికి సంబంధించి తొలగించిన ఓట్లు, డెత్ కేసులు, షిఫ్టెడ్ ఓటర్ల పరిశీలన జరిగింది. అప్పట్లో నంబూరు గ్రామానికి చెందిన వీఆర్వో బినామీ వ్యక్తితో సర్వే చేయించడంతోపాటు వెనిగండ్లలో ఇరు పార్టీలకు చెందిన వ్యక్తులతో కలిసి ఒకచోట కూర్చుని సచివాలయ ఉద్యోగి సర్వే చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మరికొందరు సర్వే చేయడంలోనే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ఎ.సాంబశివరావు, కొప్పురావూరు మహిళా పోలీసు ఎం.భవ్యశ్రీ, ఉప్పలపాడు బిల్ కలెక్టర్ జి.రాంబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ బి.వి.మల్లేశ్వరరావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,783, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 844.60 అడుగుల వద్ద ఉంది.

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.58 లక్షలు

- నవంబర్ 25 వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు
- కార్తీక మాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రణాళిక
- జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్

పాత గుంటూరు: దసరా సందర్భంగా ఈనెల 13వ తేదీ నుంచి 29 వరకు జిల్లా నుంచి పలు ప్రాంతాలకు 173 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపగా సుమారు రూ. 58 లక్షల అదనపు ఆదాయం లభించిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ తెలిపారు. సోమవారం గుంటూరు బస్ స్టేషన్‌లోని డీపీటీఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్గో విభాగంలో పార్సిల్, కొరియర్ డోర్ డెలివరి ప్రచార మాసోత్సవాలు నవంబరు 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ డోర్ డెలివరీలో 50 కేజీల వరకు అతి తక్కువ ధరలో అత్యంత భద్రంగా, వేగంగా ప్రజల ఇంటి వద్దకే ఆర్టీసీ రవాణా చేయనుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు గరుడ ఏసీ బస్సు చార్జి రూ.780 నుంచి రూ.700కు తగ్గించినట్లు వివరించారు. ఈ బస్సు గుంటూరు బస్ స్టేషన్ నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి హైదరాబాద్ (బీహెచ్ఈఎల్)కు మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు చేరుతుందని చెప్పారు. గుంటూరు-అమరావతి మధ్య రెండు బస్ స్టేషన్ల నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్తీక మాసంలో పంచారామాలకు, అరుణాచలం, అయ్యప్పస్వామి దర్శనార్థం శబరిమలైకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్టు రవికాంత్ తెలిపారు.



ఫిజియోథెరపిస్టు హత్య

గుంటూరు ఈస్ట్: ఇంట్లో ఒంటరిగా ఉన్న ఫిజియోథెరపిస్టు హత్యకు గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన సత్తెనపల్లి సీతారామాంజనేయులు (36) గుంటూరులోని ఓ ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా పని చేస్తున్నాడు. సీతారామాంజనేయులు గతంలో తన సోదరి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే భార్యను బెల్లంకొండలోనే వదిలేసి గుంటూరులోని గుంటూరువారితోట 5వ లైనులో నివాసం ఉంటున్నాడు. తాను పనిచేసే ఆస్పత్రిలోనే ఫార్మాసిస్టు అయిన స్వాతిరెడ్డిని రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే వీరి వివాహం స్వాతిరెడ్డి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. స్వాతిరెడ్డి సంవత్సరన్నర క్రితం యూఎస్‌లో ఎం ఫార్మసీ చేసేందుకు వెళ్లింది. సీతారామాంజనేయులు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. రోజూ విధులకు వెళ్లి వస్తుంటాడు. నవంబరు 1న స్వాతిరెడ్డి యూఎస్ఏ నుంచి గుంటూరు రానుంది. స్వాతిరెడ్డి తండ్రి పి.శ్రీనివాసరెడ్డి ఆర్టీసీ ఉద్యోగి. శ్రీనివాసరెడ్డి ఆదివారం రాత్రి సీతారామాంజనేయులు ఇంటికి వచ్చి మాట్లాడి వెళ్లినట్లు సమాచారం. సోమవారం ఉదయం సీతారామాంజనేయులు అసిస్టెంట్ వచ్చేటప్పటికి అతను విగత జీవుడై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో అసిస్టెంట్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీతారామాంజనేయులు తలకు బలమైన గాయమైంది. ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నచికేత్ షల్కి, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ నచికేత్ షల్కి

దుర్గమ్మ కానుకల ఆదాయం రూ. 2.58 కోట్లు

విజయవాడ: దసరా ఉత్సవాల నేపథ్యంలో దుర్గమ్మకు భవానీలు, భక్తులు హుండీల ద్వారా అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల లెక్కింపు సోమవారం నుంచి ప్రారంభమైంది. తొలి రోజైన సోమవారం నిర్వహించిన లెక్కింపులో రూ. 2,58, 64,740 నగదుతో పాటు 367 గ్రాముల బంగారం 8.745 కిలోల వెండి లభించినట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన కానుకల లెక్కింపులో దేవస్థానం, సేవా సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం కూడా లెక్కింపు కొనసాగుతుందని ఆలయ ఈవో పేర్కొన్నారు.



పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలు

- నేటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- క్వింటాకు రూ.7,020 మద్దతు ధర

ప్రత్తిపాడు: పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2023-24 సీజన్‌లో రైతులు పంటను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు. కొనుగోళ్ల కోసం ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మూడు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రత్తిపాడులోని సహజానంద కాటన్ మిల్స్‌లో ఒక కేంద్రాన్ని, కోయవారిపాలెంలోని శివసాయి టీఎంసీలో రెండో కేంద్రాన్ని, శివ పార్వతి కాటన్ జిన్నింగ్ మిల్లులో మూడో కేంద్రాన్ని సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం నుంచి కొనుగోళ్లు మొదలు కానున్నాయి.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను రూ.7,020గా నిర్ణయించింది. సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్మాలనుకునే రైతులు కచ్చితంగా తమ ఆధార్ కార్డు జిరాక్సుతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం నకలుతో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని టోకెన్ పొందాలి. ఆ తరువాత మాత్రమే సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకువెళ్లాలి. నాణ్యతాప్రమాణాల మేరకు పంట ఉంటేనే అధికారులు కొనుగోలు చేస్తారు.

పంట కొనుగోలు నిబంధనలివీ

- పత్తిని ఆరబెట్టి శుభ్రపరిచి తీసుకు రావాలి.
- తేమశాతం 8 శాతం వరకు ఉండాలి. ఎనిమిది శాతం కంటే ఎక్కువ ఉంటే ఒక్కో శాతానికి రూ.55.50 చొప్పున ధర తగ్గుతుంది.
- పత్తి పింజా పొడవు 29.50 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండాలి.
- మైక్రోనెయిర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాలి.
- వర్షానికి తడిసిన పత్తిని తీసుకురారాదు.
- దుమ్ము, ధూళి, చెత్తా, చెదారాలు లేకుండా చూసుకోవాలి.
- గుడ్డి పత్తి కాయలు, రంగుమారిన, పురుగు పట్టిన పత్తి కాయలను వేరు చేసి తీసుకు రావాలి.
- నీళ్లు చల్లిన పత్తిని కొనుగోలు చేయరు.
- కొడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తితో కలపకూడదు.



కోయవారిపాలెంలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు

రైతులకు మద్దతు ధర

ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మూడు సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో మంగళవారం నుంచి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టనున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులు పత్తిని తీసుకురావాలి. పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.మాధవరావు, సెక్రటరీ, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ

జిల్లాలో 8 పత్తి కొనుగోలు కేంద్రాలు

కొరిటిపాడు(గుంటూరు): పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో కోటేశ్వర కాటన్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, శ్రీ వేంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు పరిధిలో శివసాయి కాటన్ జిన్నింగ్ మిల్లు, సహజానంద కాటన్ జిన్నింగ్ మిల్లు, శివ పార్వతి కాటన్ జిన్నింగ్ మిల్లు, తాడికొండ మార్కెట్ యార్డు పరిధిలో శ్రీ మహాలక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లు, కొలిపెర సుబ్బారావు కాటన్ జిన్నింగ్ మిల్లు, ఫిరంగిపురం మార్కెట్ యార్డు పరిధిలోని పేరేచర్లలో విజయ వెంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు సోమవారం 'సాక్షి'కి తెలిపారు. రాజబాబు మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ బుధవారం నుంచి జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయని, రైతులు తమ దగ్గరలో గల ఏదైనా జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకువెళ్లి పత్తిని అమ్ముకోవచ్చన్నారు రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద మధ్యవర్తులు, దళారులు కనిపిస్తే చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పొడవు పింజ పత్తి క్వింటా రూ.7,020, పొట్టి పింజ పత్తి రూ.6,620కి సీసీఐ రైతుల నుంచి కొనుగోలు చేయనుందని ఆయన వివరించారు.

'గ్రామదర్శిని'ని జయప్రదం చేద్దాం

బాపట్ల అర్బన్: గ్రామదర్శిని కార్యక్రమం జయప్రదం కోసం సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ చెప్పారు. స్పందన కార్యక్రమం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 135 మంది అర్జీదారులు తమ సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. పలు సమస్యలపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా జేసీ తహసీల్దార్లు, ఎంపీడీఓలతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు గ్రామదర్శినిని జయప్రదం చేయాలని సూచించారు. స్పందన, జగనన్నకు చెబుదాం పోర్టల్లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నంబరు 1న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణపై చర్యలు చేపట్టాలన్నారు. వేమూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీలలో అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు పూర్తయినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబరు 1న అట్టహాసంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ జి.రవీంద్ర బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్

క్లుప్తంగా

బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు రిజిస్ట్రార్లు


అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు రిజిస్ట్రార్లు రాజీవ్, జయశంకర్, ఉమాశంకర్

కర్లపాలెం: పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారిని సోమవారం హైకోర్టు రిజిస్ట్రార్లు రాజీవ్‌గౌడ్, జయశంకర్, ఉమాశంకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, ఆలయ పూజారులు, హైకోర్టు రిజిస్ట్రార్లకు స్వాగతం పలికి అమ్మవారికి పూజలు చేయించారు. అమ్మవారి జ్ఞాపికలతోపాటు ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలతో సత్కరించారు.

వలపర్ల అధ్యాపకుడికి సర్వేపల్లి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఇమాం సాహెబ్

మార్టూరు: మండలంలోని వలపర్ల జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకుడు సయ్యద్ ఇమాం సాహెబ్ ఆదివారం రాత్రి సికింద్రాబాద్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం అందుకున్నారు. ఆల్ ది బెస్ట్ అకాడమీ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డాక్టర్ చంద్రయ్య చేతుల మీదుగా నేషనల్ బెస్ట్ టీచర్-2023 పురస్కారం అందుకున్నారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం నిర్మల, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం ఇమాంసాహెబ్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టు ఎంపిక

జే పంగులూరు: ఖోఖో పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయిలో పంగులూరుకు మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఐదు రోజులుగా బాపట్ల జిల్లా మండల కేంద్రం జే పంగులూరులోని ఎంఎస్‌ఆర్ అండ్ బీఎస్‌ఎం కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 37వ రాష్ట్రస్థాయి ఖోఖో శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరాన్ని ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాప్ వారు అందజేసిన క్రీడా దుస్తులను చైతన్య క్రీడాకారులకు అందజేశారు. ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ మేకల సీతారామిరెడ్డి మాట్లాడుతూ క్యాంపునకు సహకరించిన శాప్ వివిధ జిల్లాల సెక్రటరీలకు, గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ (శాప్) వీసీ అండ్ ఎండీ ధ్యాన్‌చంద్ (ఐఏఎస్) ఆర్థిక సహాయంతో నిర్వహించారు. శిబిరం పర్యవేక్షకుడు కోచ్ డి.లక్ష్మీనారాయణ రెడ్డి, అసిస్టెంట్ కోచ్ బ్రహ్మానాయుడు, మెంటార్, సహాయక సిబ్బంది, అంతర్జాతీయ క్రీడాకారుడు కర్రి శ్రీనివాసరావు, మేనేజర్ కె.హనుమంతరావు వ్యవహరించారు.


ఎంపికైన జట్టుతో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

గోవాలో ఆడే ఆంధ్రా జట్టు ఎంపిక..

జాతీయ స్థాయిలో ఆంధ్రా తరఫున గోవాలో ఖోఖో పోటీల్లో పాల్గొననున్న జట్టును కోచ్‌లు సోమవారం ఎంపిక చేశారు. వారిలో వై సతీశ్, పి.శివారెడ్డి, కె.వంశీ (ప్రకాశం), పి.నరసయ్య (విజయనగరం), ఎం.ఫణికుమార్ (ప్రకాశం), ఎ.శివ నాగిరెడ్డి (భారతీయ రైల్వే), జి.క్రాంతికుమార్ (విశాఖపట్నం), పి.స్వామినాథన్ (భారతీయ రైల్వే), బి.లక్ష్మీనారాయణ (నెల్లూరు జిల్లా), కె.రామ్మోహన్ (ప్రకాశం), ఎ.రాజ్‌కుమార్ (చిత్తూరు జిల్లా), వై.దాల్ నాయుడు (కృష్ణాజిల్లా), ఎల్.అప్పలనాయుడు (పశ్చిమ గోదావరి), కె.ప్రవీణ్ (శ్రీకాకుళం)ను ఎంపిక చేశారు.

స్పందనలో సమస్యలకు సత్వర పరిష్కారం

- జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్
- 62 అర్జీలు స్వీకరణ

బాపట్లటౌన్: స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ తెలిపారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 62 మంది ఫిర్యాదుదారులు అడిషనల్ ఎస్పీను కలిసి తమ ఫిర్యాదులను అందజేశారు. ఏఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ అధికంగా కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. పోలీస్‌శాఖకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లాలోని పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించి బాధితులకు అండగా నిలవాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్పందన సెల్ సీఐ వి.మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్

జాగ్రత్తలతోనే మధుమేహ నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు

గుంటూరు మెడికల్: మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు సమాజంలో విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా ఆ వ్యాధుల పట్ల శాస్త్రీయ అవగాహన పెంచుకుని నిరోధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ బాబు అన్నారు. . సోమవారం స్థానిక బ్రాడీపేట 2వలైనులోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో ప్రపంచం మధుమేహ నిరోధక మాసం సందర్భంగా ప్రజా ప్రయోజనార్థం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా 'మధుమేహం-కారణాలు-నిరోధక చర్యలు ' అంశంపై నవంబర్ నెల రోజుల పాటు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల కరపత్రాన్ని డాక్టర్ శ్రావణ్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ప్రజల జీవన శైలిలో, ఆహారంలో మార్పులే మధుమేహంకు కారణమవుతున్నాయన్నారు. కారణాలు ఏవైనా మానసిక ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోవడం, తీసుకునే ఆహారంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు మధుమేహం ప్రబలడానికి ప్రధాన కారణాలు అవుతున్నాయన్నారు. ఆరోగ్య సమస్యలను గుర్తించిన ప్రభుత్వం ఈ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రత్యేక పథకాలు, జిల్లాకు ఒక వైద్యాధికారిని కూడా నియమించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ జీవనశైలి వ్యాధుల్ని నివారించవచ్చన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ప్రజల్లో ఈ దీర్ఘకాల వ్యాధుల నిరోధమే లక్ష్యంగా తమ సంస్థలు నెలరోజుల ఈ ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, డాక్టర్ తాతా సేవ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి దీర్ఘకాల ప్రాణాంతక వ్యాధులు వేగంగా పెరిగిపోతున్నాయన్నారు. ఈ వ్యాధుల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపైన, కుటుంబాల పైనపడి సమాజ అభివృద్ధికి అవరోధంగా నిలుస్తోందన్నారు. నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజులపాటు ప్రజా చైతన్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, అతి తక్కువ ఖర్చుతో మధుమేహం నిర్ధారణ, పర్యవేక్షణ పరీక్షలను బ్రాడిపేటలోని ఎస్‌హెచ్‌ఓలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ మేనేజర్ పి. నిర్మల రాణి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి వి. సుబ్రహ్మణ్యం, కుందేరు విజయ దీపక్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు, డాక్టర్ సేవకుమార్, పి.రమేష్

4న గుంటూరులో సామాజిక సాధికార బస్సు యాత్ర

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పాతగుంటూరు: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 4వ తేదీ నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సును విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిందన్నారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే బస్సు యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సంగడిగుంట మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందని, మాయాబజారు సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ బేగం, కృష్ణబలిజ పూసల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గులాం రసూల్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా

జాతీయస్థాయి కరాటేలో బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

చీరాల రూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఈపురుపాలెం విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఆదివారం మంగళగిరిలో 8వ జాతీయ కరాటే పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ఈపురుపాలెం విద్యా భారతీ స్మార్ట్ స్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొని సత్తాచాటి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో రాష్ట్రం నుంచి జి.భవ్యశ్రీ, టి.వినమ్రత లక్ష్మి, ఎస్‌కె నాగుల్ జాను పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించారు. ఎ.వెంకటసాయి, ఝాన్సీలు కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను, కరాటే మాస్టర్ టి.మోహన కృష్ణను స్కూలు కరస్పాండెంట్ మళ్లా వాసవి చంద్రిక విజయకృష్ణ అభినందించారు.

ఆస్ట్రేలియా-ఇండియా సాంగత్యంపై ప్రత్యేక సమావేశం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం అధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరుగతుందని రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆస్ట్రేలియా కౌన్సెల్ జనరల్ శారకిర్లు హాజరై ఆస్ట్రేలియా-ఇండియా సాంగత్యంపై ప్రసంగించనున్నారని తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు డైక్ మన్ ఆడిటోరియంలోని బాల మోహన్ దాస్ సెమినార్ హాల్‌లో ప్రారంభమవుతుందని చెప్పారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ చీఫ్ ప్యాట్రన్ గా హాజరు కానున్నారన్నారు. ప్రత్యేక అతిథులుగా రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి, ఆచార్య కె.గంగాధరరావు, ఆచార్య పి.జాన్సన్, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ మెడికల్ సీటు ఇప్పిస్తానని డాక్టర్‌కు టోకరా

- డాక్టర్ కుటుంబం నుంచి రూ.26,50,000 వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెదకాకాని: ఎంబీబీఎస్ పూర్తి చేసిన వ్యక్తికి పీజీ సీటు ఇప్పిస్తానని ఘరానా మోసం చేసిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం గుంటూరుకు చెందిన అభిరామ్ యశస్వి ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చేసేందుకు సిద్ధమయ్యాడు. తల్లిదండ్రులు మండలంలోని గడ్డిపాడు సమీపంలో యశస్వి ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. అభిరామ్‌కు వరుసకు బాబాయి అయిన అగస్త్య శ్రీనివాస్ రాజమండ్రిలో డాక్టరుగా పనిచేస్తున్నాడు. డాక్టర్ అగస్త్య శ్రీనివాస్ కుమారుడు, కుమార్తెలకు వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామానికి చెందిన పోకల చంద్రశేఖర్ కర్ణాటక రాష్ట్రంలో పీజీ చదివేందుకు సీట్లు ఇప్పించాడని, చాలా నమ్మకమైన వ్యక్తి అని అభిరామ్‌కు పరిచయం చేశాడు. ఈ విధంగా పరిచయమైన పోకల చంద్రశేఖర్ యశస్వి ఆసుపత్రి వద్దకు వెళ్లి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న చాలా మెడికల్ కాలేజ్‌లకు ఏజెంట్‌గా పనిచేస్తున్నానని, కౌన్సెలింగ్‌తో పనిలేకుండా సీటు ఇప్పిస్తానని పరిచయం చేసుకున్నాడు. తమిళనాడు రాష్ట్రంలోని మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో పీజీ సీటు ఇప్పిస్తానని నమ్మించాడు. సీటు రూ.1.25 కోట్లు అవుతుందని, అడ్వాన్స్‌గా రూ.26,50,000 ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఏడాది మే 26వ తేదీ నుంచి అక్టోబరు 26వ తేదీ వరకూ దశల వారీగా డబ్బులు తీసుకున్నాడు. డబ్బులు తీసుకుంటున్న ప్రతిసారీ మీ సీటు మీకు గ్యారంటీ అంటూ నమ్మబలికేవాడు. చివరిసారిగా పీజీలో చేరేందుకు చెన్నై వెళ్లిన డాక్టర్ కుటుంబం ఉన్న రూము వద్దకు వెళ్లి పీజీ సీటు అడ్వాన్స్ రూ.26,50,000 సంబంధించిన బ్యాలెన్స్ రూ.6,50,000 తీసుకుని 27వ తేదీ ఉదయం 10 గంటలకు వచ్చి కళాశాలలో జాయిన్ అవ్వాలని చెప్పి వెళ్లిపోయాడు. ఉదయం ఫోన్ చేయగా పోకల చంద్రశేఖర్ ఫోన్ స్విచాఫ్ వచ్చింది. కళాశాలలోకి వెళ్లి విచారించగా కౌన్సెలింగ్ ఎప్పుడో అయిపోయిందని, క్లాసులు కూడా ప్రారంభమయ్యాయని సమాధానం చెప్పారు. దీంతో నిర్ఘాంతపోయిన డాక్టర్ కుటుంబం పోకల చంద్రశేఖర్ మోసం చేశాడని గ్రహించి పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు అభిరామ్ యశస్వి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

చీరాల: కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యల కారణంగా మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన ఆదివారం రాత్రి చీరాల రూరల్ మండలం బోయినవారిపాలెంలో చోటుచేసుకుంది. ఈపూరుపాలెం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన నారాయణరెడ్డి (40), వెంకటేశ్వరమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, వివాహాలు చేశారు. అయితే ఇటీవల కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యల కారణంగా నారాయణరెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

5న వెయిట్ లిఫ్టర్ల ఎంపిక

తెనాలిరూరల్: గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులోని శివాలయ ప్రాంగణంలో నవంబర్ 5వ తేదీన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోటీల్లో భాగంగా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన క్రీడాకారులను నవంబర్ 17 నుంచి 19 వరకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9533067682 నంబరు సంప్రదించాలన్నారు.

గోల్డ్ అప్రైజర్ చేతివాటం !

- బినామీ పేర్లతో బంగారం బదులు రోల్డ్‌గోల్డ్ తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు
- అప్రైజర్‌ను విధుల నుంచి తొలగించిన బ్యాంక్ అధికారులు!
- నూజెండ్ల యూనియన్ బ్యాంకులో ఘటన
- బ్యాంక్ సిబ్బంది పాత్రపైనా అనుమానాలు
- గోప్యంగా ఉంచిన సిబ్బంది
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలోని యూనియన్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ మాయాజాలం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంక్‌లో అప్రైజర్‌గా పని చేస్తున్న వినుకొండకు చెందిన ఒక బంగారు వ్యాపారి బినామీ పేర్లతో రోల్డ్‌గోల్డ్ తాకట్టు పెట్టి బ్యాంక్‌లో నగదు రుణం పొందినట్లు సమాచారం. అయితే రీ అప్రైజర్ తనిఖీల్లో తాకట్టు పొట్లాల్లో నకిలీ బంగారాన్ని గుర్తించారు. మోసం బయటపడటంతో విషయం బయటపడకుండా అప్రైజర్ చేత డబ్బులు కట్టించి ఆ తాకట్టు పొట్లాలు వెనక్కు ఇచ్చి అప్రైజర్‌ను విధుల నుంచి తొలగించిన విషయం గోప్యంగా ఉంచారు. అప్రైజర్ బ్యాంక్‌ను మోసం చేసినా బ్యాంక్ అధికారులు మౌనం ఎందుకు వస్తున్నారంటూ, సిబ్బంది పాత్రపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్రైజర్ పోస్టు ద్వారా నెలకు రూ.40వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేవారు ఉన్నారు. ఆ ఆదాయం చాలక కొందరు అక్రమంగా ఈ విధంగా నకిలీవి పెట్టి రుణాలు ఇప్పిస్తున్నా బ్యాంక్ సిబ్బంది ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. ఇవే కాకుండా రైతులు తాకట్టు పెట్టడానికి బ్యాంక్‌కు వచ్చినప్పుడు బంగారం నాణ్యత లేదని అబద్ధాలు చెబుతూ మంచి బంగారం చేయించుకోవాలంటే తమ షాపునకు రావాలంటూ రైతులకు సదరు అప్రైజర్ చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా బ్యాంక్ అధికారులు ఎందుకు మౌనం వహించారోనని రైతులు, కొందరు బంగారం వ్యాపారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సంఘటనలపై నిజా నిజాలు విచారించి బ్యాంక్‌లను, రైతులను మోసం చేస్తున్న అప్రైజర్లపై కఠినచర్యలు తీసుకోవాలని ఖతాదారులు కోరుతున్నారు. ఇదిలాఉండగా సదరు అప్రైజర్ సుమారు రూ.40లక్షల వరకు మోసం చేసి ఉండవచ్చని అంచనా.

యార్డుకు 30,151 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 30,151 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 28,272 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,770 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కు అందజేత



రేపల్లె: ఆరోగ్యశ్రీ వర్తించని పేదవారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో దోహదం చేస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని 1వ వార్డుకు చెందిన కొలుసు రమాదేవికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు డొక్కు వీరయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా 24వ వార్డులో ముస్లిం సోదరులు నిర్వహించుకునే జెండా పండుగకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే వార్డుకు చెందిన షేక్ కరిముల్లా కుమార్తె వివాహం నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



రేపల్లె రూరల్: ప్రజలు ప్రకృతి విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో మండలంలోని పెనుమూడి పల్లెపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. విపత్తుల సంభవించిన సమయంలో అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. నదుల వెంబడి వరదలు వచ్చేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ప్రయోగ పూర్వకంగా గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ దారం విజయ్, ఎన్డీఆర్ఎఫ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు అందినట్లు ఆర్డీవో కార్యాలయ ఏవో జాన్ పీటర్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. పెరవల్లి గ్రామంలో రహదారికి ఇరువైపు ఆక్రమణలు తొలగించాలని, పెదమట్లపూడి గ్రామంలో పట్టా భూమిని ఆన్‌లైన్ చేయాలని, గుడ్డికాయలంక గ్రామానికి చెందిన కొంత మంది ప్రజలు తమ ధాన్యాన్ని వ్యవసాయశాఖ కొనుగోలు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

ఉయ్యూరు వీరమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

చెరుకుపల్లి: హిందూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు పేర్కొన్నారు. గుళ్లపల్లి శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గుళ్లపల్లి గ్రామంలోని ఉయ్యూరు వీరమ్మ పేరంటాలు దేవస్థానం అభివృద్ధికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో దేవస్థానం శిల్పి పనులు, సాలాహారం, విమాన గోపురం నిర్మించటంతో పాటు దేవస్థానంలో నూతన శిలా విగ్రహాలు ప్రతిష్ట జరుగుతుందన్నారు. త్వరలోనే ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు చేతులు మీదుగా పనులు కూడా ప్రారంభించనున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు.

అభ్యంతరాలపై విచారణ జరపాలి

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రేపల్లె పట్టణం, మండలానికి సంబంధించిన ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించామని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పూర్తి స్థాయిలో విచారించాలన్నారు. దీంతో పాటు 2024 జనవరి 1న నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత నుంచి ఓటు హక్కు దరఖాస్తును స్వీకరించాలన్నారు. రేపల్లె పట్టణంలో మొత్తం 37,337 మంది ఓటర్లు ఉండగా ఇందులో.. 17,733 మంది పురుషులు, 19,588 మంది స్త్రీలు, 16 మంది ట్రాన్స్ జండర్‌లు ఉన్నారన్నారు. మండలంలో 48,796 మంది ఓటర్లు ఉండగా 24,285 మంది పురుషులు, 24,510మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జండర్ ఉన్నారన్నారు. వీటిపై విచారణ జరిపి నివేదికను తమకు అందజేయాలన్నారు. జనవరిలో తుది జాబితాను ప్రకటించటం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రతి ఇంటా సంక్షేమం..అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకుపోతోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం స్థానిక ముత్తాయిపాలెంలోని సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్లను జిల్లా కేంద్రంగా ప్రకటించటంతోపాటు, రూ.510కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటు చేయటంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. వైద్య సేవల కోసం చీరాల, పొన్నూరు, చెరుకుపల్లి వెళ్లే రోజులు పోయి బాపట్లకు వచ్చి వైద్యం చేయించుకునే రోజులు వచ్చాయన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలతో ఎంతో లబ్ధిపొందారని తెలిపారు. ఖచ్చితంగా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావటంతోపాటు మరెన్నో పథకాలతో ప్రజల ముందుకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎంపీడీఓ రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వడ్డిముక్కల డేవిడ్, కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే రఘుపతి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

370 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం వడ్డీవారిపాలెం హైస్కూలులో విశ్వేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 332 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, మండల స్పెషల్ ఆఫీసర్ పానాకాలరావు, సర్పంచ్ వడ్డీ సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగన్నాథపురంలో సురక్ష వైద్య శిబిరం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని జగన్నాథ పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్నాథ పురంలోని 20వ సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు.

నాటుసార తయారుచేస్తే కఠిన చర్యలు

- వృక్ష నగర్‌లో కార్డన్ సెర్చ్
- 60 లీటర్ల నాటు సార స్వాధీనం
- 450 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బాపట్లటౌన్: నాటుసార తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ టి. వెంకటేశులు హెచ్చరించారు. మండలంలోని వృక్ష నగర్‌లో సోమవారం 65 మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి ఇంటిలో తనిఖీలు నిర్వహించి, 60 లీటర్ల నాటు సార స్వాధీనం చేసుకొని, 450 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. డీఎస్పీ టి. వెంకటేశులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పి. మహేష్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. కార్డన్ సెర్చ్‌లో సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది 65 మంది పాల్గొన్నారన్నారు. నాటు సార తయారీ స్థావరాలు, అనుమానిత ప్రాంతాలను, గంజాయి విక్రయించే అనుమానితులను లక్ష్యంగా చేసుకొని కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. నాటు సారా, గంజాయి వంటి మత్తు కలిగించే వాటిని సేవించడం వల్ల అనేక రకాలైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజలు నాటు సారా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయడానికి ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, డయల్ 100, 112 లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచార అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్డన్ సెర్చ్‌లో రూరల్ సీఐ జి. వేణుగోపాలరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారతో బాపట్ల డీఎస్పీ వెంకటేశులు, సీఐలు, ఎస్ఐలు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొల్లూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని చిలుమూరులో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్నట్లు అందిన సమాచారంతో కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి నిఘా ఏర్పాటు చేశారు. చిలుమూరుకు చెందిన శ్రీరామ్ సుశీలరావు అనే వ్యక్తి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. రూ. 4,220 విలువ చేసే 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి అతనిపై కేసు నమోదు చేశారు. తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ల ఆవిష్కరణ



భట్టిప్రోలు: సీపీఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి పోస్టర్లను సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు బీఆర్టీఎస్ రోడ్ ఫుడ్ జంక్షన్ నుంచి మహా ప్రదర్శన ప్రారంభమవుతుందని, సింగ్ నగర్‌లోని ఎంబీ స్టేడియంలో 11 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, రైతు, కౌలు రైతు, ఎస్ఎఫ్ఐ నాయకులు జి. సుధాకర్, మురుగుడు సత్యన్నారాయణ, జి. నాగరాజు, పి. మనోజ్ కుమార్, పప్పుల అహరోను, దీపాల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): మండలంలోని చినకొండ్రుపాడు శివారుల్లోని ఖాళీ ప్రదేశాల్లో కొంత మంది రహస్యంగా కోత ముక్కాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం ఎస్ఐ డి. రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1010 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెదకాకానిలో..

నంబూరు గ్రామ శివారు పెనుమూలి రోడ్డులోని పొలాల్లో కోత ముక్క ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 4,450లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో కోత ముక్క ఆట జోరుగా సాగుతోంది. సోమవారం పోలీసుల్ని మార్గ మధ్యలో ఇన్‌ఫార్మర్ గుర్తించి, కోడ్ భాషలో జూదరులకు సమాచారం అందించడంతో పలువురు పరారైనట్లు సమాచారం.

సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యపరచాలి

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

దిండుపాలెం (వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలం దిండుపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన చేపట్టారు. గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో సైడు కాల్వల మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. గ్రామంలోనే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. నవంబరు 9 నుంచి ప్రతి గ్రామానికి ప్రజా ప్రతినిధులు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గడప గడపకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంచాల భగద్గీత, ఎంపీపీ జాలాది రూబెన్, మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రఘురామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆళ్ల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు ఉయ్యూరు అప్పిరెడ్డి, సుబ్బారెడ్డి, సురేష్, కుంచాల వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాంబిరెడ్డి, సాంబ్రాజ్యం, డాన్‌బాస్కో, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నేతల ద్వారా కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బాపట్ల: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను వెనుకబడిన తరగతుల ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాధికారం కోసం పాటుపడాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. విజయ్ కుమార్ చేపట్టిన ఐక్యత విజయ పథం యాత్ర సోమవారం బాపట్లలో జరిగింది. పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరిన ఐక్యత విజయపథం యాత్ర అంబేడ్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయపథం యాత్ర బాపట్ల విచ్చేసినట్లు చెప్పారు. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాంధ్ర సాంబశివరావు, ఎస్సీ నాయకులు ముప్పిరి రాజశేఖర్, విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జి.చార్వాక, శీలం రోజ్‌బాబుతోపాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్

మెషీన్ లెర్నింగ్ ఆల్గరిథమ్స్– అప్లికేషన్స్ పుస్తకావిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆర్. వసంత, డాక్టర్ జి. నీలిమ రాసిన ‘మెషీన్ లెర్నింగ్ అల్గరిథమ్స్ – అప్లికేషన్స్’ పాఠ్య పుస్తకాన్ని సోమవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెషీన్ లెర్నింగ్ అనేది ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌లో ఒక ముఖ్య భాగమని పేర్కొన్నారు. దీన్ని సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, మెడికల్ డయాగ్నోస్టిక్స్, డ్రోన్స్, జీపీఎస్ వంటి వాటిలో ఉపయోగిస్తున్నారని వివరిరించారు. పాఠ్య పుస్తకంలో మెషీన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్‌ను విశదీకరించామని రచయితలు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, డాక్టర్ బి.బసవేశ్వరరావు, డాక్టర్ కె. లావణ్య, డాక్టర్ సూర్యకామేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రిన్సిపల్ గంగాధరరావు

స్పందన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనలో అందే ఫిర్యాదుల్ని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని నగర ఇంచార్జి కమిషనర్ పి.వి.కె. భాస్కర్ తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 24 ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. అదనపు కమిషనర్ (ఇంచార్జి) సీహెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్

మండలాభివృద్ధికి కృషి చేయాలి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): మండలంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని పిట్టలవానిపాలెం ఎంపీపీ ఎస్కే బాజీ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించినట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అల్లూరు సొసైటీ చైర్మన్ మండే విజయ్‌కుమార్ సాగునీటి సరఫరా సరిగా లేక వరిపైర్లు ఎండిపోతున్నాయని అధికారులకు తెలిపారు. చివరి భూములకు కూడా సాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయరాజు, సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి అరుణకుమారి, అనూష, తహసీల్దారు కవిత, ఎంపీడీవో మారుతీ శేషమాంబ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నగరం: రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు బాల ఏసు ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని నన్నం సమీరా ఎంపికైనట్లు కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సిటమ్ తెలిపారు. స్కూల్లో సోమవారం సమీరాను అభినందించారు. ఈ సందర్భంగా సిస్టర్ ఎల్సిటమ్ మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో జరిగిన జిల్లాస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలలో పాఠశాలకు చెందిన సమీరా అండర్–17 విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిస్టర్ సజీవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థిని సమీరాతో పాఠశాల కరస్పాండెంట్

సామాజిక సాధికార యాత్రతో వైఎస్సార్ సీపీలో జోష్..

కర్లపాలెం: బాపట్ల నియోజక వర్గంలో శనివారం ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమవడంతో వైఎస్సార్ సీపీలో జోష్ పెరిగిందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైన సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు సోమవారం పార్టీ కార్యాలయం వద్ద సమావేశమై హర్షం ప్రకటించారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు ద్విచక్ర మోటారు వాహనాలతో, ఆటోలలో తరలి వచ్చి విజయవంతం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, వైఎస్సార్ అభిమానులకు ఏడుకొండలు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై, స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతిపై ప్రజలలో ఉన్న అభిమానంతోనే సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంత మైందన్నారు. 2024లో జరగనున్న ఎన్నికలలో బాపట్ల నుంచి ఎమ్మెల్యే కోన రఘుపతిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యులు రాతంశెట్టి లక్ష్మణరావు, ఎస్కే ఆసిఫ్ అలీ, కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్ బేగ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, కార్యవర్గ సభ్యులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు చీరాల సత్యనారాయణరెడ్డి, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, పేరాల వెంకట సురేష్, కంకిపాటి నాగరాజు, చిక్కాల సాగర్, కాగిత మహేష్, భావన్నారాయణ తదితరులున్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సమావేశమైన నాయకులు

నూతన బోధన విధానంపై అవగాహన పెంచుకోవాలి

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నూతన విద్యా బోధన విధానంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని డీఆర్పీ జి.మురళీ మోహన్ అన్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్ వినియోగించి విద్యార్థుకు పాఠాలు చెప్పటంపై సోమవారం యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. డీఆర్పీ మురళీ మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణలతో విద్యా బోధనకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. స్థానిక హెచ్ఎం జి.రమాదేవి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో మొత్తం 600 మంది ఉపాధ్యాయులకు 6 రోజుల పాటు రెండు రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని చెప్పారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమంలో 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని ఆమె చెప్పారు.



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న డీఆర్పీ మురళీ మోహన్

ఎన్‌సీసీ క్యాంప్‌లో ప్రతిభ చూపిన భట్టిప్రోలు విద్యార్థులు

భట్టిప్రోలు: గుంటూరు సమీపంలోని చౌడవరం ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 21 నుంచి ఎన్‌సీసీ ఏటీసీ–5వ క్యాంప్‌లో భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని అనేక పోటీలలో ప్రతిభ చూపారు. ఫైరింగ్, వాలీబాల్‌లో ఎస్‌డీ షబీనా ప్రథమ స్థానం, నృత్యంలో డి. సాత్విక ప్రథమ స్థానం, టగ్ ఆఫ్ వార్‌లో భవాని, స్నేహితలు ప్రథమ స్థానం, రన్నింగ్‌లో ఎస్కే రజియాబీ ద్వితీయ స్థానం సాధించారు. వీరికి ఆదివారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ కేవీఎల్ పార్వతీ ఆధ్వర్యంలో ఈ హైస్కూల్ విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఇన్‌చార్జి హెచ్ఎం కె.కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు శ్రీ సత్యరత్న, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, బి.శ్రీనివాసరావు అభినందించారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మెరుగైన పద్ధతులతో అధిక దిగుబడులు

భట్టిప్రోలు: రైతు ఉత్పత్తి సంఘాలు మెరుగైన పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గుడిమెట్ల శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని 38 రైతు సంఘాల లీడర్లకు మండల సమాఖ్య కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ సామూహికంగా ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయడం, ప్రజా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయడం, రుణ సదుపాయాలు, రికార్డులు, సమావేశాల నిర్వహణ, వ్యవసాయ అనుబంధ శాఖల సహకారంతో సమన్వయంగా పని చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవోలు కె. రజనీ కుమారి, దాసరి హనోకు, అకౌంటెంట్ బి . శిరీషా, ఆయా గ్రామాల ఎఫ్‌పీజీ గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీమన్నారాయణ

ప్రజాస్వామ్యం బలహీన పడుతోంది

బాపట్ల అర్బన్: ప్రపంచంలో భారత దేశంలోని ప్రజాస్వామ్య విధానం గొప్ప ప్రసిద్ధిగాంచిందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బాపట్ల స్థానిక ఎన్జీఓ హోంలో ‘ప్రజాస్వామ్యం – ఎన్నికలు– ఓటరు చైతన్యం’పై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరూరా జన విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా రానున్న ఎన్నికల ఆవశ్యకతపై ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం పాలనలో భారత రాజ్యాంగ ముఖ్య లక్షణమైన ప్రజాస్వామ్యం నానాటికి బలహీన పడుతున్న విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎన్నికల్లో ధన ప్రభావం, కులం, మతం, మద్యం, నేరస్థ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రొఫెసర్ కె. విజయ్ కుమార్, విశ్రాంత అధ్యాపకులు గోరంట్ల శాంతరావు, ఆట్ల బాలాజీ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు అన్నారు. కోలా శరత్, కరణం రవీంద్ర, డాక్టర్ పీసీ సాయిబాబు, వై.భాస్కరరావు, జీవి బ్రహ్మం, గుదే రాజారావు, బక్క జయరామిరెడ్డి, నూర్ భాషా ఖాసిం, కె. కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి